క్లుప్తంగా

మద్యపానం నిషేధించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాలు, స్థానిక యువజన సంఘాల నాయకులు

కుల్కచర్ల: మద్యపానం నిషేధించాలని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మహిళలు, యువజన సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం గ్రామంలోని పలు దుకాణ సముదాయాల్లోకి వెళ్లి మద్యం అమ్మకాలు నిలిపివేయాలని కోరారు. గత రెండురోజుల క్రితం బెల్టు షాపులు నిర్వహించొద్దని అవగాహన కల్పిస్తూ, ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. ఈ నియమాలను ఎవరైనా అతిక్రమిస్తే రూ. లక్ష జరిమాన చెల్లించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..మద్యపాన నిషేధానికి అధికారులు, ఆయా పార్టీల నేతలు సహకరించాలని కోరారు.

వంటగది మంజూరు చేయండి

బషీరాబాద్: మండలంలోని రెడ్డిఘణాపూర్ ప్రభుత్వ పాఠశాలకు నూతన వంట గదిని మంజూరు చేయాలని పాఠశాల హెచ్ఎం రవికాంత్ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పాఠశాల ఆవరణలోని వంటగది శిథిలావస్థకు చేరిందని, వర్షం వస్తే కురుస్తుందని ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. గోడలు, పైకప్పు ప్రమాదకరంగా తయారయ్యాయని వెంటనే కూల్చేసి కొత్త భవనం నిర్మించాలని కోరారు.

మొక్కలను పెంచడం అందరి బాధ్యత

కుల్కచర్ల: మొక్కలు నాటి పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని మరికల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పరిధిలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు పెరగడం వల్ల గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలి

అనంతగిరి: ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామగ్రామాన జెండా ఎగురవేయాలని మాదిగ మహజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం వికారాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 31 సంవత్సరాలు కావస్తుందని, ప్రతిసారి ఉద్యమ స్ఫూర్తితో ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దింటి మధు, రాజు, మణి, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ముసురు వర్షం.. చల్లబడిన వాతావరణం



హిమాయత్‌నగర్‌లో గొడుగుతో వెళ్తున్న మహిళలు

మొయినాబాద్‌రూరల్: మండల, మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షంతో వాతావరణం చల్లబడింది. బుధవారం సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రజలు ఎవరూ బయటకు రాకపోడవడంతో మండలంలో రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా మారాయి.

కేఏఎన్‌పీఎస్ మహాసభలను విజయవంతం చేయండి

కేశంపేట: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించనున్న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి (కేఏఎస్‌పీఎస్) రెండో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ మోహనకృష్ణ కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన పలువురు నాయకులతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కుల అస్తిత్వ నిర్మూలన అనే అంశంతోనే కేఏఎస్‌పీఎస్ ఆవిర్భవించిందన్నారు. దళితులపైన జరిగిన దాడులకు వ్యతిరేకంగా పోరాటాలను చేసినట్టు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తున్నట్టు స్పష్టం చేశారు. మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కేఏఎస్‌పీఎస్ అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్మికుల వెతలు తీరవా?

- సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు
- మూడు నెలలుగా పెండింగ్
- భారంగా కుటుంబ పోషణ
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామ కార్మికులు
- పట్టించుకోని అధికారులు



హస్నాబాద్ గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

దుద్యాల్: గ్రామాల్లో పంచాయతీ కార్మికులు అనునిత్యం పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్నారు. పరిశుభ్రంగా ఉంచడంలో వారు ఎంతో కృషి చేస్తున్నారు. ఐనప్పటికీ వారికి ప్రతీ నెల ఇవ్వాల్సిన వేతనాలు సక్రమంగా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. తమ వెతలు తీరవా? అని వారు ప్రశ్నించుకుటుంన్నారు. ముఖ్యంగా వారు ఒక్కరోజు పనిలోకి రాకుంటే ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉంటాయి. దుర్గందం వ్యాప్తి చెందుతుంది. కానీ వారు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్నప్పటికీ మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. కుటుంబాన్ని పోషించలేక ఆందోళన చెందుతున్నామని చెబుతున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలను చూస్తే దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచే వారు కరువయ్యారు. ప్రభుత్వం తమతో వెట్టిచాకిరీ చెయించుకుంటున్నాయని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. వారికి ప్రతీ నెల సకాలంలో వేతనాలు విడుదల చేయాలని వారు కోరుతున్నారు. మండలంలోని దుద్యాల్, ఆలేడ్, హస్నాబాద్, లగచర్ల, హకీంపేట్, చిలుముల మైల్వార్, చెట్టుపల్లి తండా, ఈర్లపల్లి, పోలేపల్లి, గౌరారం, వంటి గ్రామాల్లో మూడు నెలల నుం వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని కార్మిక నాయకులు, కార్మికులు చెబుతున్నారు. వేతనాలు అందక రోజువారి ఖ ర్చులకోసం అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

> **రోజువారీ ఖర్చులకు..**
>
> 
>
> కొన్ని నెలలుగా వేతనాలు సకాలంలో రాకపోవడంతో బతుకులు భారమయ్యాయి. రోజువారీ ఖర్చులకు ఇబ్బందిగా ఉంది. వేతానాలు విడుదల చేయకున్నా నిత్యం విధులకు హాజరవుతున్నాం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నాం. తక్షణమే ఇబ్బందులను గ్రహించి అధికారులు వేతనాలు విడుదలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలి.
>
> – లక్ష్మి, పంచాయతీ కార్మికురాలు, హస్నాబాద్

ఆలయ ప్రవేశానికి ఇబ్బందులు కల్గించొద్దు

పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణకు వినతి



అన్నపూర్ణకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు, తదితరులు

కుల్కచర్ల: ఆంజనేయస్వామి ఆలయ ప్రవేశానికి కొంతమంది తమ స్థలం అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పీరంపల్లి గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి దేవాలయం 140సర్వే నంబరులోని 18గుంటల భూమి దేవాదాయ శాఖ పరిధిలో ఉందని తెలిపారు. కాలక్రమేణ ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఈ దేవాలయ సరిహద్దు నుంచి పలువురు వ్యక్తులు ప్రహరీ నిర్మించి భక్తులు ఆలయంలో వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు వినతి పత్రంలో పేర్కొన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించి గ్రామస్తులందరికి దేవాలయ ప్రవేశం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆయా పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

పరిగి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దుద్యాల్: పరిగి మండల పరిధిలోని రంగంపల్లి, గోవిందాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ భూమిని అక్రమంగా ఇతర వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసిన పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావుపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాటం సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూర్ చంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం దుద్యాల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ ప్రధాన చౌరస్తాలో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పరిగి మండలం రంగంపల్లి గ్రామానికి చెందిన 146 సర్వే నంబర్‌లో 4–17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఒక ఎకర భూమిని ఇతర వ్యక్తులకు తహసీల్దార్ పట్టా చేశారని ఆరోపించారు. గోవిందాపూర్ రెవెన్యూ పరిధిలోని 95 సర్వే నంబర్‌లో 16 ఎకరాల భూమిని కూడా అక్రమంగా పట్టా చేశారని పేర్కొన్నారు. వెంటనే అతని అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్, సాయికుమార్, సాయిలు, మదరయ్య, జనార్దన్, రాములు, నర్సయ్య పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణం



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు వేయిస్తున్న సిరాజొద్దీన్



బంట్వారం: రొంపల్లిలో ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం తదితరులు

- హౌసింగ్ ఏఈఈ సిరాజొద్దీన్
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేత

మోమిన్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈఈ సిరాజొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మొరంగపల్లి, ఎన్కేపల్లి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లర్లతోగానీ, గోడలతో గానీ నిర్మించుకోవచ్చని ఆయన తెలిపారు. పునాదులు తీసి బెస్‌మెంటు కాగానే లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో రూ.లక్ష, తరువాత దశలవారీగా వేస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, గ్రామ ప్రత్యేకాధికారి గీత, కార్యదర్శి తిరుపతమ్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నర్సింలు, నాయకులు మైపాల్‌రెడ్డి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజలు జోరుగా సాగుతున్నాయి. హస్నాబాద్, హకీంపేట తదితర గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నా ఇళ్ల నిర్మాణాలకు అధికారులతో కలిసి లబ్ధిదారులు భూమి పూజ నిర్వహించారు.

పేదల కల సాకారం..

కుల్కచర్ల: పేదల కల సాకారం అవుతుందని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని వివరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము, కొత్తపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్యం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు సంటి యాదయ్య, శ్రీను, శ్రీశైలం పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

బంట్వారం: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రొంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపీడీఓ రాములు స్థానిక నాయకులతో కలిసి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పెద్దఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, రొంపల్లి మాజీ సర్పంచ్ రాధాకృష్ణగౌడ్, సీనియర్ నాయకులు సంగమేశ్వర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తలారి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డమీది గంగారంలో..

ధారూరు: మండలంలోని గడ్డమీది గంగారం గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి కార్యదర్శి బాల్‌రాజ్, పీఏసీఎస్ డైరెక్టర్ కె రవీందర్ భూమి పూజ చేసి ముగ్గు వేశారు. అల్లాపూర్, రుద్రారం గ్రామాల్లో ఎంపీడీఓ నర్సింహులు భూమి పూజ నిర్వహించి బేస్‌మెట్ గుంతలు తీయించి పనులను ప్రారంభించారు.

అర్హులందరికీ కేటాయిస్తాం..

దోమ: గ్రామాల్లోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను పంపిణీ చేసి, ముగ్గు వేసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఎమ్మెల్యే కృషితో గ్రామాల అభివృద్ధి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప పేర్కొన్నారు. కొత్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడారు. తాండూరు మండలంలో మొదటి విడతగా 33 గ్రామాలకు 700పైగ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి, గని కార్మిక సంఘం డైరెక్టర్ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, జగదీష్, బస్వరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై శిక్షణ సదస్సు

తహసీల్దార్ గోవిందమ్మ

దోమ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల బీఎల్ఓలకు ఓటరు నమోదుపై శిక్షణ సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గోవిందమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సును గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల బీఎల్ఓలు సకాలంలో హాజరై శిక్షణ కేంద్రంలో పాల్గొనాలని తెలిపారు. ఓటరు నమోదు, సవరణలు, కొత్త ఓటర్ నమోదుతో పాటు ఇతర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!

అంగన్‌వాడీ సమీపంలో బావి

కంచె ఏర్పాటు చేయించాలని వేడుకోలు

పట్టించుకోని అధికారులు



రక్షణ లేని బావి

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో చేదుడు బావి ఉంది. అది ప్రమాదకరంగా ఉన్నా ఎవరు కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఈ బావిలో నీరు 95 శాతం చేరుతుందని వారు పేర్కొన్నారు. పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో పిల్లలకు ఎప్పుడు ఏ మౌతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న సీఐ విజయ్‌కుమార్, సంస్థ సభ్యులు

షాద్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పలకలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని, దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంఘం సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, సంఘం అధ్యక్షుడు సురేష్‌సింగ్ రాజ్, సభ్యులు లక్కాకుల అనిల్‌కుమార్, చందనా జైన్, దుర్గాదేవి, హెచఎం శశికళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాలకు బీటీ రోడ్లు

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి



పాలబాయి తండాలో బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాజేశ్‌రెడ్డి, పార్టీ నాయకులు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కలుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పాలబాయితండాకు రూ.1.7కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి, తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. అందుకు సీఎం కోట్లాది నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. తండావాసులు వారికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, పార్టీ నాయకులు మల్లేశం, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, ధర్మేందర్, సంతోశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరి



గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న మల్కాపూర్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, పీఆర్టీయూ నాయకులు

ఏంఈఓ వెంకటయ్యగౌడ్

తాండూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరని ఏంఈఓ వెంకటయ్యగౌడ్ పేర్కొన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తిలో అందరి కంటే ఆదర్శప్రాయుడు గోపాల్‌రెడ్డి అని కొనియాడారు. బుధవారం తాండూరు మండలం మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చిట్యాల గోపాల్‌రెడ్డి (స్కూల్ అసిస్టెంట్–సోషల్) విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మినీ భూకైలాస్ ఫంక్షన్‌హాల్లో పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. అనంతరం ఏంఈఓ మాట్లాడుతూ..గోపాల్‌రెడ్డి 20 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చాడన్నారు. విద్యార్థి భవిష్యత్‌ను కోరే ఏకైక వ్యక్తని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, తాండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు జొన్నల వినోద్, పురుషోత్తంరెడ్డి, వైద్యనాథ్, జైపాల్‌రెడ్డి, నాగప్ప, అంబమ్మ, మధుసూదన్‌రెడ్డి, పండరి, రవి సింధే, రఘునాథ్‌రెడ్డి, ఇందిరమ్మ, సునీత, సంగీత, మహాలక్ష్మి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలకు డిమాండ్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట ఏబీవీపీ నగర కార్యదర్శి నవీన్‌నాయక్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. పట్టణంలో కొనసాగుతున్న శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులపై పాఠశాల యాజమాన్యం అక్రమ కేసులను పెట్టడం సరికాదన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలుచేస్తూ అధిక ధరలకు పుస్తకాలను అమ్ముతూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నారని ఆరోపించారు.

వయోజనులందరికీ విద్య



బంట్వారం: కోట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప

చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్

కుల్కచర్ల: వయోజనులందరికీ విద్య అందించడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఉల్లాస్‌లో భాగంగా మహిళ సంఘాలనాయకులు, డీఆర్‌డీఓ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారు, అక్షరజ్ఞానం లేని వారిని గుర్తించి, విద్యపై ఆసక్తి ఉన్న వారిని చదువుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. దీనికి ఉల్లాస్ ఉపయోగకరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ విజయకుమార్, మహిళ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: వయోజనులందరికీ విద్య అందజేయడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్వహిస్తున్న న్యూ ఇండియా లిట్రసీప్రోగ్రాం (ఉల్లాస్)ను ఉత్సాహంగా చేపట్టాలని ఎంఈఓ చంద్రప్ప పేర్కొన్నారు. బుధవారం కోట్‌పల్లి ఎంఆర్సీ భవనంలో మొబైల్ యాప్ నమోదుపై మహిళా సంఘాలకు, డీఆర్‌డీఓ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్–తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదోతరగతి (14 సంవత్సరాలు నిండినవారు), ఇంటర్ పూర్తి చేసిన వారికి నమోదుకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఉల్లాస్‌లో 15 సంవత్సరాలు పైబడి 50 సంవత్సరాల వరకు నిరక్షరాస్యులను నమోదు చేసి, సంబంధిత వివరాలను సర్వే ఫారంలో నింపాలని వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ అధికారి శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ అరుణ్ కుమార్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, శారద, మోయినుద్దీన్, గోపాల్, ఉమాదేవి, విశ్వేశ్వర్, సీఆర్పీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంఈఓ రాంచందర్

విజయవంతం చేయాలి: ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని బంట్వారం ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీనిపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

ప్రతీ ఒక్కరికి విద్య నేర్పించాలి

పరిగి: నిరక్షరాస్యులకు ప్రతీ ఒక్కరికి విద్య నేర్పించేల ప్రత్యేక కృషి చేయాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. పట్టణ కేంద్రంలో ఉల్లాస్ మొబైల్ యాప్‌పై డీఆర్‌డీఓ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఓలో పనిచేస్తున్న సిబ్బంది గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి వారి వివరాలను సేకరించాలన్నారు. గ్రామాల్లో నిరక్షరాస్యులకు చదువు నేర్పించేందుకు వాలంటీర్లను నియమించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్టువంటి ఉల్లాస్ మొబైల్ యాప్‌లో నిరక్షరాస్యుల వివరాలను పొందుపరచాలని సూచించారు. నిరక్షరాస్యులకు చదువు నేర్పే బాధ్యతను వాలంటీర్లు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కరీం, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.